క్లుప్తంగా

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును సన్మానిస్తున్న నిర్వాహకులు

తిర్యాణి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండలంలోని దంతన్‌పెల్లి గ్రామంలో గురువారం భీమయ్యక్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వాహకులు, అధికారులతో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ తుకారం భట్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ఎస్సై చుంచు రమేశ్, నిర్వాహకులు ఆత్రం గంగారం, లక్ష్మణ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది



బదిలీపై వెళ్తున్న కామరాజ్‌ను సన్మానిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఉద్యోగికి పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని ఆసిఫాబాద్ అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో బీట్ అధికారి కామరాజ్‌కు సెక్షన్ అధికారిగా పదోన్నతి పొంది బదిలీ కాగా, రేంజ్ కార్యాలయంలో గురువారం ఆయన్ను సిబ్బందితో కలిసి సన్మానించారు. డిప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ప్రవీణ్‌కుమార్, సరోజారాణి, రాజేశ్వర్, సెక్షన్ అధికారులు సాయిచరణ్ పరండె, లక్ష్మణ్, అత్తరొద్దీన్, సత్యనారాయణ, భగవంత్‌రావ్, బీట్ అధికారులు స్వప్న, మహేశ్, రజిత, ఉమారాణి, రవి, సుమన్, సాదిక్, రామ్మూర్తి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో గురువారం ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ హేమంత్ కుమార్ బొర్కుడే ఆవిష్కరించారు. అక్రిడిటేషన్ కమిటీలో ఉర్దూ జర్నలిస్టుల్లో ఒకరిని సభ్యుడిగా తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను కోరారు. డీపీఆర్వో కృష్ణమూర్తి, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మీర్జా సలీంబేగ్, కార్యదర్శి మజీద్ ఇగ్బాల్, కోశాధికారి మహమ్మద్ ఫయాజుద్దీన్, మహ్మద్ మున్వరొద్దీన్, ముషాకం అహ్మద్, వాసిఖాన్, షౌకత్ అలి, సాజిద్ ఖాన్, మునావర్ ఖాన్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న వినోద్, నిర్వాహకులు

తిర్యాణి: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఆత్రం సక్కు యూత్ ఫోర్స్ అధ్యక్షుడు వినోద్ అన్నారు. మండలంలోని గుడిపేటలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గురువారం నిర్వాహకులు ప్రథమ స్థానం సాధించిన చింతపెల్లి దేగా జట్టుకు రూ.10 వేలు, ద్వితీయస్థానం సాధించిన జట్టుకు రూ.7,516 నగదుతోపాటు బహుమతులు అందజేశారు. సర్పంచ్ పెందుర్ జంగుబాయి, నిర్వాహకులు కోట్నాక పైకు, మడావి జలపతి, ఆత్రం దశ్వంత్‌రావు, వెడ్మ రాజేశ్ తదితరులు ఉన్నారు.

అల్పాహారం పంపిణీ

కౌటాల: మహారాష్ట్రలోని చెప్రాలలోని కార్తీక్ స్వామి ఆలయానికి గురువారం బెజ్జూర్ నుంచి 19వ మహాపాదయాత్ర నిర్వహించారు. భక్తులు పాదయాత్రగా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి మీదుగా మహారాష్ట్రకు వెళ్లారు. దీంతో తుమ్మిడిహెట్టి వద్ద వారికి తాటిపల్లి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేగేటు కష్టాలు!

- రెబ్బెనలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణమెప్పుడో?
- 12 పంచాయతీలకు తప్పని ఇక్కట్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు



రైల్వేగేట్ వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

రెబ్బెన: మండల కేంద్రంలో ఉన్న రైల్వేలెవల్ క్రాసింగ్ వద్ద ఉన్న రైల్వేగేట్‌తో ట్రాక్‌కు అవతలి వైపు గ్రామాల ప్రజల కష్టాలు తీరడం లేదు. ఏళ్లు గడుస్తున్నా రైల్వేగేట్ స్థానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. రైళ్ల రాకపోకల సమయంలో మూసి ఉన్న గేట్ వద్ద వాహనదారులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారు. అత్యవసర సమయంలో అవస్థలకు గురవుతున్నారు. అయినప్పటికీ పాలకులు, రైల్వేఅధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. రైల్వేశాఖలో చేపడుతున్న సంస్కరణ చర్యల్లో భాగంగా లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న గేట్లు తొలగిస్తూ అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతోంది. అయితే రద్దీ అధికంగా ఉన్న రెబ్బెనలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే ప్రణాళికలు తయారు చేసిన నేటికి కార్యరూపం దాల్చడం లేదు.

12 పంచాయతీలకు తప్పని తిప్పలు

రెబ్బెనలోని రైల్వేగేట్ మూలంగా ట్రాక్‌కు అవతలి వైపు ఉన్న 12 గ్రామ పంచాయతీల ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నంబాల, రాజారాం, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపల్లి, కొమురవెల్లి, దర్మారం, గంగాపూర్, లక్ష్మీపూర్, పాశిగాం, తుంగెడ, మాద్వాయిగూడ పంచాయతీల పరిధిలో సుమారు 20 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. దారిమధ్యలో రైల్వే గేటు వారి పాలిటశాపంగా మారుతోంది. గత కొంతకాలంగా రైళ్ల రద్దీ కారణంగా ఒక్కోసారి మూడు, నాలుగు రైళ్లు వెళ్లే వరకు గేట్ తెరవడం లేదు. దాంతో ప్రయాణికులు సుమారు 45 నిమిషాల వరకు వేచి ఉంటున్నారు.

సర్వేకు పరిమితం

లేతన్‌గూడ, రెబ్బెన, తక్కళపల్లి ప్రాంతాల్లో రైల్వేలెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయి. లేతన్‌గూడ గేట్ వద్ద ఇప్పటికే అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించి రైల్వేగేటును తొలగించారు. తక్కళ్లపల్లిలో అండర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. రెబ్బెనలో అండర్‌బ్రిడ్జి బదులు ఫ్లైఓవర్‌బ్రిడ్జిని నిర్మించాలని అధికారులు గతంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించాలని భావించిన అందుకు సర్కారు ముందుకు రాలేదు. అయితే రైల్వేశాఖ తన సొంత నిధులతో నిర్మాణం చేపట్టాలని భావించింది. ప్రైవేటు సంస్థతో గతేడాది సర్వే చేయించినా పనులు ముందకుసాగలేదు. దీంతో మండలవాసులు అసహనానికి గురవుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ఊహాగానాలే తప్పా రైల్వేశాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు.

ప్రతీరోజు ఇబ్బంది



రెబ్బెనలో రైల్వేగేట్‌తో ప్రతీరోజు ఇబ్బంది పడుతున్నాం. పని మీద మండల కేంద్రానికి వెళ్తూనే ఉంటాం. దారి మధ్యలో గేట్ మూసివేయడంతో నిరీక్షిస్తున్నాం. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– గోగర్ల రాజేష్, రెబ్బెన

అధికారులు దృష్టిపెట్టాలి



రెబ్బెనలోని రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా అధికారులు దృష్టి పెట్టాలి. గంగాపూర్ నుంచి రెబ్బెనకు 3 కి.మీ., బైక్‌పై వస్తే 5 నిమిషాల్లో చేరుకుంటే, కేవలం రైల్వేగేట్ వద్దే 30 నిమిషాలు నిరీక్షించాల్సి వస్తోంది.

– ఇగురపు సంజీవ్, గంగాపూర్

ఫ్లైఓవర్ నిర్మించాలి



రెబ్బెనలోని రైల్వేగేట్ వద్ద గేట్ వద్ద మూడు, నాలుగు రైళ్లు వెళ్లే వరకు గేట్లు తెరవడం లేదు. గంటల తరబడి నిరీక్షిస్తున్నాం. రైల్వేగేటు స్థానంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– పూదరి హరీశ్, తుంగెడ

పులుల సంరక్షణపై దృష్టి



కమ్మర్‌గాంలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పెంచికల్‌పేట్: కాగజ్‌నగర్ మండలంలోని దిరగాం అడవుల్లో రెండు పెద్దపులులు మృతిచెందగా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలో పులుల సంచారం, సంరక్షణపై అటవీశాఖ అధికారులు దృష్టిసారించారు. మండలంలోని చేడ్వాయి, దరోగపల్లి, కొండపల్లి, లోడుపల్లి, మెరెగూడ, అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ గ్రామ అటవీప్రాంతాల్లో పెద్దపులుల సంచారం ఉంది. గతంలో పత్తి చేనులో ఇద్దరిపై దాడి చేసి హతమార్చింది. అటవీశాఖ అధ్వర్యంలో గత నాలుగు రోజులుగా చేలలో రైతులు, కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. అటవీ ప్రాంతంలో కూలీలు గుంపులుగా శబ్దాలు చేస్తూ వెళ్లాలని సూచిస్తున్నారు. పనులు చేసేక్రమంలో అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. పంటల రక్షణ పేరుతో ఉచ్చులు, విద్యుత్ తీగలు, విషప్రయోగం చేస్తే వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

రైతులకు అవగాహన

పెద్దపులుల దాడుల్లో మృత్యువాతపడ్డ పశువులకు పరిహారం పంపిణీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పరిహారం పంపిణీలో జాప్యం జరగ్గా ఉన్నతాధికారుల ఆదేశాలతో తక్షణ సాయం కింద పులుల దాడుల్లో మృతిచెందిన పశువులకు రూ.5 వేలు అందిస్తామని రైతులకు వివరిస్తున్నారు. పులుల దాడుల్లో పశువులు మరణిస్తే అటవీ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంటున్నారు. గ్రామస్తులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నారు. పెద్దపులుల, వన్యప్రాణులు సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరుతున్నారు.

ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల: గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అడిషనల్ డీఆర్డీవో కుటుంబరావు అన్నారు. స్థానిక రైతు వేదికలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై కౌటాల, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల్లోని కార్యదర్శులకు గురువారం డివిజన్ స్థాయి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళికలు తప్పనిసరన్నారు. పంచాయతీ సభల్లో అన్ని శాఖల అధికారులు గ్రామ పనుల గురించి చర్చించి వాటికి పరిష్కారం చేయాలన్నారు. అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో కనీస అవసరాలు తాగునీరు, రోడ్డు సౌకర్యం, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఎల్‌పీవో సురేశ్‌బాబు, ఎంపీవో మౌనిక, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

28న మేరు సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని సందీప్‌నగర్‌లోని మేరు సంఘ భవనంలో ఈనెల 28న మండల కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘ బాధ్యులు అక్కు విజయ్, రాచర్ల సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయాలని, 25న మధ్యాహ్నం 12 గంటల లోపు విత్‌డ్రా చేసుకోవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ వేసేవారు రూ.3 వేలు చెల్లించాలని, విత్‌డ్రా చేసుకునే వ్యక్తికి రూ.1500 తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రెబ్బెన: పట్టుకున్న బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని జిల్లాకేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లాకేంద్రంలో బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు వివిధ రకాల పేర్లతో ఉన్న సంచులతో సిద్ధంగా ఉన్నాయని సమాచారంతో గురువారం తనిఖీలు నిర్వహించారు. హరిబాబుకు సంబంధించిన కిరాణ దుకాణంలో 2.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

రెబ్బెన: అక్రమంగా నిల్వ ఉంచి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మండలంలోని గోలేటి విలేజ్‌లో గల ఓ కిరాణ దుకాణంలో గురువారం తనిఖీ చేపట్టారు. శంకరయ్యకు చెందిన షాపులో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెబ్బెన స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఎస్సై సందీప్ కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సర్పంచ్ దంపతులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో నూతనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు అశోక్‌చారి, దేవర వినోద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ, విగ్రహప్రదాత సర్పంచ్ సంజీవ్ పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

అంత్యక్రియల్లో పాల్గొని.. ధైర్యాన్ని అందించి..



జైనూర్‌లో కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జైనూర్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు అనక మానిక్‌రావు (74) గురువారం తెల్లవారుజాము హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న ఖానాపూర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవ లక్ష్మిలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ముందుగా భౌతికకాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యలను పరామర్శించి ధైర్యం చెప్పారు. సర్పంచ్ మెస్రం పార్వతీ లక్ష్మణ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, భారాస మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, భారాస సీనియర్ నాయకుడు జన్నావార్ పవన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కాగజ్‌నగర్‌టౌన్: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్‌లోని ఎన్టీఆర్‌చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుల్లపల్లి లావణ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేంద్రప్రసాద్

లింగాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, సవరణపై గురువారం బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 20,21 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆర్ఐ ప్రకాశ్, ఆర్ఐ ప్రదీప్, బీఎల్వోలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీలకు భవనాలు కరువు

- అద్దెభవనాలు, పాఠశాలల్లో కార్యకలాపాలు
- తొలివిడతలో ఆరు జీపీలకు మంజూరు
- చౌక, బామానగర్‌లో స్థలాలు గుర్తింపు
- పూర్తిదశకు బామానగర్ జీపీ



అద్దె భవనంలో పెసరికుంట పంచాయతీ కార్యాలయం

దహెగాం: తండాలు, పల్లెలు 500 జనాభా కలిగిన గ్రామాలను గత ప్రభుత్వం పంచాయతీలుగా మార్చింది. పంచాయతీలుగా మారిన పల్లెల్లో సర్పంచులు ఎన్నికయ్యారు. కాని ఐదేళ్లయినా జీపీలకు పక్కా భవనాలు మంజూరు చేయలేదు. గత సంవత్సరం జీపీలకూ పక్కా భవనాలు మంజూరు చేసింది. కిందిస్థాయి అధికారుల సమన్వయ లోపం వల్ల స్థలాలు గుర్తించలేదు. దీంతో సర్పంచులు, పాలకవర్గం సభ్యులు ఐదేళ్ల కాలం గడిచిపోతుంది. అయినా పక్కా భవనాల నిర్మాణం పూర్తి కాలేదు. ఈజీఎస్ కింద ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. అధికారుల పట్టింపులేని కారణంగా అవి ముందుకు సాగడం లేదు.

మండలంలో 24 పంచాయతీలు

మండలంలో 24 పంచాయతీలు ఉన్నాయి. అందులో 11 జీపీలకూ పక్కా భవనాలు ఉన్నాయి. మిగతా 13 పంచాయతీల కార్యకలాపాలు అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో గతేడాది తొలివిడత కింద చౌక, బామానగర్, పెసరికుంట, కమ్మర్‌పల్లి, చినరాస్పెల్లి, గెర్రె పంచాయతీలకు ఈజీఎస్ కింద ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. కాని స్థలాల గుర్తింపు జరగలేదు. కేవలం చౌక, బామానగర్‌లో మాత్రమే స్థలాలు గుర్తించి బామానగర్‌లో భవనం పూర్తి దశకు చేరింది. నాలుగు నెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే కోనప్ప చౌకలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాని పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. అధికారుల సమన్వయలోపం వల్ల చినరాస్పెల్లి, గెర్రె, పెసరికుంట, కమ్మర్‌పల్లి పంచాయతీల్లో స్థలాలు గుర్తించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈనెల 31తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

సర్పంచుల పదవీకాలం ఈనెల 31తో ముగియనుంది. ఐదేళ్ల కాలం ఇలా గడిచిపోయిందని అయినా పంచాయతీలను, పాలకవర్గాన్ని అద్దె భవనంలో కొనసాగించారు. నూతన పంచాయతీ భవన యోగ్యం మాకు కలిగేలా లేదని వారు వాపోతున్నారు. అధికారుల ముందుచూపు లేని కారణంగా మంజూరైన పక్కా భవనాల నిర్మాణాలు ముందుకు కదలేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కాంగ్రెస్ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందా అన్న ఆలోచన పంచాయతీల ప్రజల్లో కలుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలకు పక్కా భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థలాలు గుర్తించాకే పనులు

మండలంలో తొలివిడత కింద ఎన్ఆర్ ఈజీఎస్ కింద ఆరు పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. చౌక, బామానగర్‌లో స్థలాలు గుర్తించి పనులు ప్రారంభించాం. మిగతా నాలుగు జీపీల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలాలను గుర్తించాక పనులు చేపడుతాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రాజేశ్వర్‌గౌడ్, ఎంపీడీవో

సంక్షిప్త వార్తలు

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో శనివారం ఉదయం 8.00 గంటలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రక్తపరీక్ష, కాన్సర్ పరీక్ష, లివర్, కిడ్నీ, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, సీబీపీతో ఈటీసీ 134 పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ

రెబ్బెన: నిస్సహాయులకు తమకు తోచినసాయం అందించాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని వృద్ధాశ్రమంలో నిస్సహాయులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20వ తేదీలోగా వెబ్‌సైట్ http// tgcet.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి


ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడిలో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యుడు షబ్బీర్ ఓ ప్రకటనలో కోరారు. కాలనీలో గత కొన్ని నెలలుగా డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని పేర్కొన్నారు. అధికారులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు



కెరమెరి: మకరసంక్రాంతి సందర్భంగా మండలకేంద్రంలో గురువారం మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే రోజు కనుమ రోజున ఈ క్రతువును కొనసాగిస్తారు. కాని ఇక్కడ మహారాష్ట్ర సంస్కృతి కొనసాగుతుండడంతో మరో రెండు రోజుల వరకు ఈ కార్యక్రమాన్ని మహిళలు ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలు ఒకరి ఇళ్లకు మరొకరు వెళ్లి తమకు ఇష్టమైన వస్తువులతోపాటు బియ్యం, గోధుమలు, క్యారెట్, చెరుకు, జామ, రేగి, తదితర వస్తువులను ఇచ్చిపుచ్చుకున్నారు.

వైద్యుడిని నియమించాలి



మాట్లాడుతున్న ఆనందరావు

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిని నియమించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి కూటిల ఆనంద్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతరెండు నెలలుగా వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. రెండు నెలల నుంచి వైద్యుడిని నియమించాలన్నా ధ్యాస అధికారుల్లో లేకపోవడం విడ్డూరమన్నారు.